# పగ

రాత్రి ఎనిమిది గంటలు దాటింది ... జగన్మోహనరావు రోడ్డుకి ప్రక్కగా నిల్చుని, ఖాళీ రిక్షా కోసం యెదురుచూస్తున్నాడు. అతని మొహంలో అలసట అస్పష్టంగా ద్యోతకమౌతోంది.

పదిహేను నిముషాలు గడిచినా, ఖాళీ రిక్షా అగుపించడం లేదు. బస్సుల సిబ్బంది సమ్మె చెయ్యడంవల్ల ఆ రోజు బస్సులు రావని జగన్మోహనరావుకి తెలుసు. అందుకే లోలోన విసుక్కున్నాడు. నడిచిపోవాలంటే ఇల్లు బాగా దూరంలో వుంది. అదిగాకుండా, ఆఫీసుపనితో అలసిపోయిన శరీరం. నడవడానికి సుతరాం అంగీకరించడం లేదు. స్కూటరు ఒకటి కొనుక్కుంటే, బాగుండిపోనని అప్పుడనిపించిం దతనికి. స్కూటరు కొనే తాహతు లేక కొనడం కాదు. ఏక్సిడెంట్లకి భయపడి మానేశాడు.

అంతలో ఖాళీ రిక్షా వస్తూండటం చూశాడు. అతని మొహం కాస్తంత కుదుటబడింది.

"ఏయ్ రిక్షా...." అంటూ కేకవేశాడు,

రిక్షావాడు దగ్గరగా వచ్చాడు.

"ఎక్కడికి వెళ్తారు బాబూ?" ప్రశ్నించాడు వాడు.

"స్టేటుబ్యాంకు దగ్గరే మా ఇల్లు."

"రూపాయి అవుతుందండీ...."

"సరే....పద...." బేరమాడ్డం ఇష్టంలేక రిక్షాలో కూలబడ్డాడు జగన్మోహనరావు. రిక్షావాడు, జగన్మోహనరావుని చూడగానే ఆలోచనలో పడ్డాడు. ఆయన్ని తానెక్కడో చూసినట్లు గుర్తుకు రాగానే, మెదడుకి పని కల్పించాడు. జగన్మోహనరావు పని చేస్తున్న ఫ్యాక్టరీలో నలుగురు కలాసీలు కావాలని సూచాయగా తెలిస్తే, తానూ దరఖాస్తు పెట్టుకొన్నాడు. అదీ ఆ ఆఫీసులో పని చేస్తున్న ఓ గుమాస్తా ధర్మమా అంటూ తెలిసిన వార్త. ఇంటర్వ్యూకి పిలిచిన రోజున తనతోపాటు మరో పద్నాలుగు మంది వచ్చారు. ఇంటర్వ్యూ తీసుకున్న వ్యక్తి జగన్మోహనరావే. అడిగిన ప్రశ్నలన్నీ చచ్చువే. అన్నింటికీ తాను జంకకుండా సమాధానం చెప్పాడు. కాని, తాను సెలక్టు కాలేదు. నిజానికి నలుగురే కావాలని మొదట్లో విన్నా, ఎనమండుగురిని తీసుకున్నారు. ఆ ఎనమండుగురిలో తాను లేకపోయినందుకు. వొళ్ళు మండిపోయిన మాట వాస్తవమే! అయితే, ఏం చెయ్యగలడు? నోరు మూసుకుని వచ్చేశాడు. ఇటువంటి అన్యాయాలు, పక్షపాతాలు యెన్నో విన్నాడుగా! ఇప్పుడు ప్రత్యక్షంగా చూశాడు. సెలెక్టయిన వాళ్ళంతా, వయసులో తనకంటె పెద్దవాళ్ళే! ఆ రోజేగాని తాను సెలెక్టయివుంటే, ఇంక ఇప్పుడీ రిక్షా తొక్కే దౌర్భాగ్యానికి పాల్పడేవాడు కాదు. ఇలా ఆలోచిస్తుంటే. అతడిలో ఆవేశం, అసహనం చోటు చేసుకున్నాయ్. కళ్ళలో యెర్రని చారలు ఏర్పడడం అతనికి తెలీదు. అతడి మెదడు చురుకుగా, వేడిగా పని చేస్తోంది. ఆ వేడిలోనే రిక్షా వేగం అధికమయ్యింది.

చల్లని గాలివీస్తుంటే, రిక్షాలో కూచునిపోవడం, యెంతో హాయిగా తోచింది జగన్మోహనరావుకి. ఆఫీసులో పడిన శ్రమనంతా క్రమంగా మర్చిపోతున్నాడు.

"నన్ను గుర్తుపట్టారా బాబూ?" ఉండబట్టలేక అడిగాడు రిక్షావాడు.

"లేదోయ్ .... ఎప్పుడో నీ రిక్షాలో వెళ్ళివుంటాన్లె...." ముక్తసరిగ సమాధానం చెప్పాడు జగన్మోహనరావు.

"అది సరేనండీ! ఆ మధ్య మీ ఫ్యాక్టరీలో కలాసీల కోసం సెలెక్షను పెట్టారు, గుర్తుందా?"

"ఔనోయ్.... అప్పుడు నువ్వూ వచ్చావా యేమిటి?"

"వచ్చానండీ! కాని ఏం లాభం? నన్ను తీసుకోలేదు మీరు. ఎనిమిదో క్లాసు చదివిన వాణ్ణి. యుక్తవయసులో వున్నవాణ్ణి. ఏ కష్టాని కయినా ఓర్చుకోగల వాణ్ణి. అటువంటి నన్ను సెలెక్టు చెయ్యకుండా, నాకంటె వయసులో పెద్దవాళ్ళనీ, పిల్లల తండ్రుల్నీ తీసుకోవడంలో మీ ఉద్దేశం ఏమిటో తెలుసుకోవచ్చునా? వాళ్ళ దగ్గర లంచం తీసుకుని, వాళ్ళని సెలెక్టు చేశారా?" ఆవేశం పట్టలేక, అంతరంగంలో మెదుల్తూన్న సందేహాన్ని బైటపెట్టాడు రిక్షావాడు.

వాడి అభియోగానికి జగన్మోహనరావు బాధ పడలేదు. కోపమూ తెచ్చుకోలేదు. అతనికి బాగా తెలుసు. యీరోజుల్లో ఉద్యోగాలు దొరకని వాళ్ళంతా అలాగే అంటూ ఉంటారని.... మెల్లగా నవ్వుకున్నాడు.

"నీ పేరేవిఁటోయ్ ...?" అడిగాడు సౌమ్యంగానే.

"పాపారావు."

"చూడు పాపారావ్, నువ్వనుకున్నది నిజం కాదని చెబితే, నువ్వు నమ్మవు. పోతే వాళ్ళని యెందుకు సెలెక్టు చేశావని కదూ, నీ సందేహం? అదీ చెప్తాను. వాళ్లు వివాహితులు. వాళ్ళకి యెన్నో బాధ్యతలున్నయ్. నిన్నూ ఆ వివరా లడిగాను. నువ్వు బ్రహ్మచారివని చెప్పావు. నీకు బాధ్యతల్లేవు. నీ ఒక్కడి పొట్ట పోషించుకోడానికి నువ్వు యెక్కువగా శ్రమపడ నవసరంలేదు. కాని, వాళ్ళ విషయం ఆలోచించు. వయసు పెరిగిపోతోంది. జవసత్వా లుడిగిపోతున్నయ్. బాధ్యతల బరువు పెరిగి పోతోంది. అటువంటి పరిస్థితుల్లో వారికి నికరమైన ఓ ఆదాయం అవసరం. అందుకే వాళ్ళని తీసుకున్నాను...." అంటూ చెప్పుకుపోయాడు, జగన్మోహనరావు. అడిగిన ప్రతివాడికీ అలా సంజాయిషీ చెప్పుకోవడం అవసరం లేకపోయినా, పాపారావుకి నిజం చెప్పాలని చెప్పాడు.

అయితే జగన్మోహనరావు జవాబు, పాపారావుకి తృప్తి కలిగించ లేదు.

"వాళ్ళు చెప్పింది అబద్ధమైతే, మీ నిర్ణయానికి విలువేముంది చెప్పండి?" అన్నాడు పాపారావు.

"అది నాకు అనవసరం....వాళ్లు చెప్పింది నిజమనే నేను నమ్మాను అలాగే నువ్వు చెప్పిందీ నమ్మాను."

"నేను అవివాహితుణ్ణే కావచ్చు, అయితేనేం? నాకు తలిదండ్రులు, తమ్ముళ్ళూ, చెల్లెళ్ళూ వుండొచ్చును కదా! అవి బాధ్యతలు కావా?"

"ఆ బాధ్యతలు వారికీ ఉండొచ్చు...."

"అయితే, నే నిలా నిరుద్యోగిగా ఉండవల్సిందేనా? సాంప్రదాయ మైన కుటుంబంలో పుట్టి, దురదృష్టవశాత్తూ, చదువుకి స్వస్తి చెప్పి, రిక్షా తొక్కడం వృత్తిగా పెట్టుకున్న నేను యిలా యెన్నాళ్ళుంటాను?"

"ఆ ప్రశ్న నన్నడిగితే నేనేం చెబుతానోయ్? నువ్వు యువకుడివి. ఇంకెన్నో అవకాశాలు రావొచ్చు."

"మీలాగే అందరూ అనుకుంటే, వచ్చిన అవకాశాలు వాటంతట అవి పోనూవచ్చు."

"అది నీ అదృష్టం మీద ఆధారపడుంటుంది" అన్నాడు జగన్మోహనరావు.

పాపారావు వికృతంగా ఓ నవ్వు నవ్వేడు. "అదృష్టం....! మంచి మాట చెప్పారండీ! ఇప్పుడు మీరు ఇల్లు చేరడం మీ అదృష్టంమీదే ఆదారపడుంటుందంటే, మీరేమంటారు?" కటువుగా అన్నాడు పాపారావు.

జగన్మోహనరావు కాస్తంత కంగారుపడ్డాడు వాడి ప్రవర్తనకి.

"అంటే యేవిఁటి నీ ఉద్దేశం?" తన కంగారుని బైట పెట్టకుండా, గద్దించి మరీ అడిగాడు.

పాపారావు గట్టిగా నవ్వడం తప్పించి, మరేం మాట్లాడలేదు. రిక్షా వేగాన్ని హెచ్చించాడు. మనుషుల్ని, బండ్లని, రిక్షాల్ని తప్పించుకుని మరీ పోతోంది రిక్షా.

జగన్మోహనరావు భయపడ్డాడు ఆ స్పీడు చూసి "ఏవిఁటోయ్ ఆ స్పీడు? యాక్సిడెంటు అవగల్దు. నాకేం తొందర్లేదులే, మెల్లగా తొక్కు.

లేకపోతే ఆపేయ్ .... నడిచి పోతాను" ఆతృతగా అన్నాడు. అతని గుండెలో ఓ భయం పట్టుకు పీకుతోంది – పాపారావు తనపై ప్రతీకారం తీర్చుకోడానికి యాక్సిడెంటు చేస్తాడేమోనని.

"కంగారు పడకండి! మీకేం భయం లేదు. మీ అంతటి గొప్ప వాణ్ణి, కనికరం, కరుణ, నిండివున్న కరుణామయిణ్ణి. కాలి నడకను పంపిస్తానా? అబ్బే!" అంటూ రిక్షాని మరింత స్పీడుగా తొక్కడం ప్రారంభించాడు.

జగన్మోహనరావుకి యేమీ పాలుపోలేదు. ఏం చెయ్యాడమో! అతని గుండెలు విపరీతంగా కొట్టుకుంటున్నయ్ అంతే! టౌనుహాలు ప్రక్క నుంచి తిరిగిన రిక్షా, ఓ చెట్టుకి ఢీకొంది. అది ప్రమాదవశాత్తూ జరిగింది కాదు గాబట్టి, కావాలని చేసిన ప్రమాదం గాబట్టి, పాపారావు ముందుగానే దూకేశాడు.

ఇంకేముంది? రిక్షా ముందు చక్రం, అప్పడంలా అయిపోయింది. జగన్మోహనరావు కళ్లు మూసుకుని వెనక్కి తిరిగి రిక్షాని గట్టిగా పట్టుకుని ఉండిపోయాడు మనసులో భగవంతుణ్ణి ధ్యానించుకుంటూ. పాపారావు మాత్రం ఓ రాయి మీద పడ్డాడు. అతడి నుదుటికి బాగా గాయం తగిలింది. రక్తం బొట బొట కారుతోంది.

అప్పటికే జనం మూగేశారు. రిక్షాలో గుండె ఆగిపోయిన మనిషిలా ఒదిగివున్న జగన్మోహనరావుని ఎవరో తట్టారు. తృళ్ళిపడినట్టుగా వెనక్కి తిరిగాడు. సైకిలురిక్షా ముందు చక్రం యెలా పచ్చడయ్యిందీ చూశాడు. తాను బ్రతికి బైటపడినందుకు, భగవంతుడికి మనసులో కృతజ్ఞత చెప్పుకున్నాడు.

"మీరు చాలా అదృష్టవంతులండీ!" అన్నారెవరో జగన్మోహనరావుని ఉద్దేశించి.

"ఔనండీ! నిజంగా, నేను అదృష్టవంతుణ్ణే! ఆ రిక్షావాడెలా ఉన్నాడో మొదట చూడండి" అంటూ క్రిందికి దిగాడు జగన్మోహనరావు. అతనికి కాళ్లు యింకా వణుకుతూనే ఉన్నాయ్. గుండెలు కొట్టుకుంటూనే ఉన్నాయ్.

జగన్మోహనరావుకి తెలుసు. పాపారావు తనని గాయపర్చాలని. లేదా చంపాలని రిషాని చెట్టుకి ఢీ కొట్టించినట్టు, ఢీ కొట్టించే ముందు వాడందుకే దూకేసినట్టు, అయితే తన అదృష్టం బావుంది కాబట్టి, తాను సురక్షితంగా ఉన్నాడు. పాపారావు అనుకున్నంత మాత్రాన తనకి ప్రమాదం జరుగుతుందా దైవేచ్ఛ లేకపోతే? అపకారం తలపెట్టి, తనే అపకారం పొందాడు. పాపాం!.... అనుకున్నాడు మనసులో.

జగన్మోహనరావు, రిషావాడి దగ్గరికి నడిచాడు. వాడు గుడ్లు తేల వేస్తూ, జగన్మోహనరావుకేసి చూశాడు. వాడికి ఏడుపొచ్చింది. జగన్మోహనరావుకి వాణ్ణి ఆ స్థితిలో చూడగానే జాలి వేసింది. ఎవరో గుడ్డపీలిక చింపి, వాడి నుదిటికి కట్టారు. అయినా రక్తం చిమ్మడం ఆగలేదు. అక్కడున్న రెండు మూడు ఖాళీ రిషాలు చూశాడు.

"వాణ్ణి ఆ ఖాళీ రిషాలో యెక్కించండి. దయచేసి యెవరైనా వాడి వెంట రండి.... నేనూ వస్తాను, హాస్పిటల్‌కి తీసుకుపోదాం...."

"నేనొస్తాను పదండి ...." అంటూ ఒక వ్యక్తి పాపారావుని ఖాళీ రిషాలో కూచోబెట్టుకుని, హాస్పిటల్‌కి బయలుదేరాడు. జగన్మోహనరావు మరో రిషాలో వెళ్ళాడు. తనకి అపకారం తలపెట్టిన వాడయినా పాపారావుని ఆ స్థితిలో వదలిపెట్ట బుద్ధికాలేదు జగన్మోహనరావుకి. అతనిలోని మానవత్వం, ద్వేషానికి, పగకి అతీతుణ్ణి చేసిందతణ్ణి.

హాస్పిటల్లో పాపారావుకి వెంటనే కట్టు కట్టారు. ఇంజక్షనిచ్చారు. ఎక్కువగా రక్తం పోవడంవల్ల అతనికి కాస్సేపు స్పృహ తప్పింది. మరి కొద్దిసేపటికి స్పృహ వచ్చింది. కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా జగన్మోహనరావు అగుపించేసరికి, రెండు చేతుల్తో కళ్ళు మూసుకుని, బావురుమన్నాడు పాపారావు. తాను కసితో, ద్వేషంతో, జగన్మోహనరావుకి అపకారం చెయ్యాలనుకున్నాడు. కాని జరిగిందేవిఁటి? తనకే అపకారం జరిగింది. అతను నిష్కల్మషుడు గాబట్టే యిలా జరిగిందేమో! అనుకున్నాడు మనసులో.

"నన్ను క్షమించండి బాబూ! మీకు అపకారం చెయ్యాలనుకుని, నేనే ప్రాయశ్చిత్తాన్ని పొందాను ..." అంటూ ఏఁపోయాడు పాపారావు.

జగన్మోహనరావు - పాపారావు భుజాన్ని తట్టాడు, అనునయ ధోరణిలో.

"నీలో కలిగిన ఉద్రేకం నీచేత అలా చేయించింది పాపారావ్. ఆ విషయాన్నింక మర్చిపో. నువ్వు యెక్కువగా మాట్లాడకూడదు. విశ్రాంతి తీసుకో! మూడు నాలుగు రోజుల్లో నయమైపోతుందిలే, మరేం కంగారు పడకు" అన్నాడు జగన్మోహనరావు.

జగన్మోహనరావు మంచితనానికి యెలా కృతజ్ఞత చెప్పుకోవాలో, అర్థం కాలేదు పాపారావుకి. దేవుళ్ళంటే యిలాగే వుంటారేమో!

మీరు దేముడిలాంటివారు బాబూ! మిమ్మల్ని తప్పుగా అర్థం చేసుకున్నాను..." పశ్చాత్తప్తుడై అన్నాడు పాపారావు. ఆవేశం, ద్వేషం, కసి యెవ్వరికీ మంచిని తెచ్చిపెట్టవు, పాపారావ్. ఒక్కొక్కప్పుడవి మనం వూహించని అనర్థాల్నే సృష్టిస్తాయ్. అదృష్టవశాత్తూ మనిద్దరమూ బ్రతికి బైటపడ్డాం సరిపోయింది గాని, ఏ ఒక్కరు మరణించినా యెంత ఘోరం జరిగి వుండేదో, ఆలోచించు. ఇంతకీ ఒక్క విషయాన్ని గుర్తుంచుకో. మనిషి వూహలు, ప్రయత్నాలు, యధాతథంగా జరిగిపోవు. దేవుడి ఆజ్ఞ కూడా దోహదమవ్వాలి" అన్నాడు జగన్మోహనరావు.

పాపారావు బరువుగా ఓ నిట్టూర్పు వదిలాడు.

"నిజమే బాబూ! నా జీవితంలో యీ గుణపాఠాన్ని మర్చిపోలేను" అన్నాడు అతడి కళ్ళలో నీరు గిర్రున తిరిగింది.

"మరి నేను వెళ్ళొస్తానోయ్, రేపు మళ్ళీ వస్తాన్లె ...." అంటూ లేచాడు, జగన్మోహనరావు.

పాపారావు అప్రయత్నంగా రెండు చేతులా జోడించి, కృతజ్ఞతా పూర్వకంగా జగన్మోహనరావుకి నమస్కరించాడు.

"నువ్వేం అధైర్య పడకోయ్. నేనొస్తూనే ఉంటాన్లె...." అంటూ నిష్క్రమించాడు, జగన్మోహనరావు.

పశ్చాత్తాపంతో పరితప్తుడైన పాపారావు కళ్ళు మూసుకున్నాడు. జగన్మోహనరావు మంచితనానికి, మానవత్వపు విలువలకు మనసులో అభినందించాడు.

* ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 28.1.1978 *